క్లుప్తంగా

అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

లక్ష్మీపురం: గుంటూరు నగరంలో వివిధ ప్రాంతాలలో నీటి కలుషితం కారణంగా డయేరియా విజృంభిస్తుందని, వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి నగరంలో మరిన్ని ప్రాంతాలకు విస్తరించకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. గురువారం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో డయేరియా బాధిత రోగులను సీపీఎం బృందం పరామర్శించింది. ప్రస్తుత పరిస్థితుల్లో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్ళి వైద్య పరీక్షలు నిర్వహించాలని, ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలన్నారు. నగర కార్యదర్శి కె. నళినీకాంత్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై పాలకులకు శ్రద్ధ లేదు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్

లక్ష్మీపురం: ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వల్ల గుంటూరులో డయేరియా తాండవం చేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ విమర్శించారు. డయేరియా బారినపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను జంగాల అజయ్‌కుమార్, సీపీఐ నగర కమిటీ నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం జంగాల అజయ్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ డయేరియా బారిన పడిన వారందరూ అత్యధికంగా పేదవారేనన్నారు. నగరంలోని పాత గుంటూరు, ఇజ్రాయిల్ పేట, నెహ్రూనగర్, బుచ్చయ్యతోట, బొంగరాలబీడు ప్రాంత వాసులని, ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా వర్షం వచ్చిన ప్రతీసారి గుంటూరు నగరంలోని పలు ప్రాంతాల ప్రజలు డయేరియా బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కార్యదర్శి కోట మాల్యాద్రి, సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్థూలకాయం నివారణపై అవగాహన అవసరం

లక్ష్మీపురం: రోజువారీ ఆహారంతో చక్కెర, నూనె వినియోగం తగ్గిస్తే స్థూలకాయం కొంతవరకు నివారించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.శ్రీదేవి తెలిపారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా గురువారం గుంటూరు శివారు భాగ్యనగర్‌లో అంగన్‌వాడీ సెంటర్‌లో స్థూలకాయం నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే స్థూలకాయంపై అవగాహన కలిగి ఉండాలని, పిల్లలు ఎత్తుకు తగిన బరువు ఉండేలా చూసుకోవాలని అన్నారు. ప్రభుత్వం ఈ నెల 17 నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు రాష్ట్రీయ పోషణ మాసం నిర్వహిస్తుందని, దానిలో భాగంగా ఈ రోజు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియ చేశారు. ఏఎన్ఎం కె.వెంకటరమణ, హెల్త్ సూపర్‌వైజర్ సునీల, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఐపై కేసు నమోదు

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): ఓ మహిళ పట్ల అనుచితంగా ప్రవర్తించి.. ఆమె మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించిన ఎస్ఐపై పోలీసులు కేసు నమోదు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు... గత కొద్ది కాలం కిందట చేబ్రోలు ఎస్ఐగా పనిచేసిన వెంకటకృష్ణను వీఆర్‌కు పంపుతూ పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అప్పటికే ఆయనపై అనేక ఆరోపణలతోపాటు, మహిళలపై వ్యవహరిస్తున్న వైఖరిపై వీఆర్‌కు పంపినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఒక మహిళతో నేరుగా, 'నాకు ఇప్పటికే ఎనిమిది మందితో అఫైర్ ఉంది. నువ్వు తొమ్మిదో దానివి, నీ టైం వచ్చే వరకు ఆగు' అంటూ అత్యంత జుగుప్సాకరంగా వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐ మాటలకు మనస్తాపం చెందిన ఆ మహిళ లాలాపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

27న ఏఎల్ బీఈడీ కళాశాల వజ్రోత్సవాలు



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు లాడ్జి సెంటర్‌లోని ఆంధ్ర లూథరన్ (ఏఎల్) బీఈడీ కళాశాల వజ్రోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఏఈఎల్‌సీ పరిపాలనాధికారి జోసఫ్ పీఎస్ ఆవిష్కరించారు. గురువారం ఏఈఎల్‌సీ కార్యాలయంలో జోసఫ్ పీఎస్‌ను కలిసిన కళాశాల ప్రిన్సిపాల్‌తో కూడిన అధ్యాపక బృందం ఈనెల 27న జరగనున్న వజ్రోత్సవాలకు జోసఫ్ పీఎస్‌ను ఆహ్వానించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్తేరు సునీల మాట్లాడుతూ ఏఎల్ బీఈడీ కళాశాలను స్థాపించిన 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈనెల 27న ఉదయం 10 గంటలకు కళాశాల ప్రాంగణంలో జరగనున్న వేడుకలకు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారని, వీరితో పాటు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, పూర్వ విద్యార్థి ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు. అదే విధంగా కళాశాల ప్రగతికి నిదర్శనంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నారని చెప్పారు. తొలుత జోసఫ్ పీఎస్ చేతులమీదుగా ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. కళాశాల పరిపాలనాధికారి డాక్టర్ సాపాటి అబ్రహాం వెస్లీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యంతోనే డయేరియా

- వైఎస్సార్ సీపీ గుంటూరు నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా
- జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులకు పరామర్శ



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా, రాష్ట్ర కార్యదర్శి రాజనారాయణ

గుంటూరు మెడికల్: గుంటూరు నగరంలో డయేరియా ప్రబలడానికి కారణం పాలకుల నిర్లక్ష్యమేనని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ గుంటూరు నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా అన్నారు. గురువారం డయేరియా బారిన పడి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను ఆమె పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. నగరంలో శానిటేషన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. తూర్పు ఎమ్మెల్యే గురువారం గుంటూరు జీజీహెచ్‌లో బాధితులను పరామర్శించి ఆహారం వల్లే డయేరియా కేసులు వచ్చాయని మీడియాకు వెల్లడించారన్నారు. వాస్తవానికి నీటి కాలుష్యం వల్లే డయేరియా కేసులు వచ్చాయని, వార్డులో చికిత్స పొందుతున్న బాధితులు తమతో అదే విషయాన్ని ప్రస్తావించారన్నారు.

ఒక్కసారిగా పెరిగిన కేసులు

మురుగునీటి వల్లే నగరంలో డయేరియా కేసులు పెరుగుతున్నాయని, నిన్న 32 కేసులు ఉండగా, నేటికి 60కి పెరిగాయని వెల్లడించారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడం, మంచి నీటి సౌకర్యం కల్పించడం, మీకు చేతగాకపోతే మీరు పట్టించుకోకపోతే మాకు చెప్పండని, మేం పట్టించుకుని చేస్తామన్నారు. వాటర్ పైపులైన్ల లీకులు ఎక్కడ జరుగుతుందనేది ఇప్పటి వరకు గుర్తించి పరిష్కరించలేదన్నారు. గుంటూరు నగరంలో గంట, రెండు గంటలు వర్షం కురిస్తేనే రోడ్లు సముద్రాలుగా మారుతున్నాయన్నారు. రోడ్లపై నిల్వనీటిని తోడడంలోనూ, వర్షానంతరం పేరుకుపోయిన బురదకయ్యలను తొలగించడంలోనూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. అదేవిధంగా జీజీహెచ్‌లో సైతం లిఫ్టులు పనిచేయడం లేదని, రోగులకు కనీసం సెలైన్లు పెట్టే స్టాండ్లు కూడా లేక గోడలకు వేలాడదీశారన్నారు. పాలకుల నిర్లక్ష్యంతోనే ప్రజల ప్రాణాలు పోతున్నాయని, ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శానిటేషన్ వ్యవస్థను మెరుగు పరిచి, ప్రజలకు స్వచ్ఛమైన నీరందించాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారులతో పనిచేయించడంలో నగర మేయర్ విఫలమయ్యారన్నారు.

మోసానికి ప్రతిరూపం చంద్రబాబు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు
- 31వ డివిజన్‌లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'



స్కానర్‌లు ఆవిష్కరిస్తున్న అంబటి రాంబాబు, నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా, పార్టీ నేతలు

పట్నంబజారు: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిలువునా మోసం చేసి.. తాను నిలువెత్తు మోసానికి ప్రతిరూపం అని చంద్రబాబు నిరూపించుకున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు విమర్శించారు. నియోజకవర్గంలోని 31వ డివిజన్ ఏటీ అగ్రహారం '0' లైనులో గురువారం పార్టీ నేత తోట వెంకటేశ్ ఆధ్వర్యంలో బాబూ ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. సభలో ముందుగా ప్రజలకు హామీల గురించి వివరించే స్కానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ చంద్రబాబు జీవిత చరిత్రలో ఇచ్చిన హామీలను ఎప్పుడైనా అమలు చేశారా..? అనే విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని, అదేవిధంగా చెప్పని ఎన్నో సంక్షేమ పథకాలను సైతం ప్రజలకు అందించారని గుర్తు చేశారు. ప్రజల విద్య, వైద్యాన్ని సైతం దోపిడి చేస్తూ.. రాష్ట్రంలో కూటమి నేతలు రాక్షస పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. ఏడాదిన్నరపైగా పాలనలో ప్రజలకు ఒరగబెట్టింది ఏమి లేదని ఆరోపించారు. పైగా సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని చెప్పుకోవటానికి కూటమి నేతలకు సిగ్గుండాలన్నారు. చంద్రబాబు, కూటమి ప్రభుత్వం రోబోయే రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

■ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ చంద్రబాబు రాజకీయ జీవితమంతా మోసం, అబద్ధాలతో సాగిందని విమర్శించారు. ప్రజలకు మేలు చేసే ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని స్పష్టం చేశారు. నమ్మిన ప్రజలను నట్టేట ముంచి.. ఏ ఒక్క హామీని అమలు చేయకుండా, కేవలం స్వలాభం కోసం పరిపాలన సాగించే వ్యక్తి చంద్రబాబు అని మండిపడ్డారు. రెండు నాల్కల ధోరణితో.. ఎన్నికల సమయంలో ఒక మాట.. గెలిచిన తరువాత మరో మాట చెప్పి పబ్బం గడుపుకోవటం చంద్రబాబుకు కొత్తేమి కాదన్నారు. రానున్న రోజుల్లో ప్రజాగ్రహం చవిచూడక తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు శారదాలక్ష్మి, మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు పఠాన్ సైదాఖాన్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నందేటి రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి రాము, పార్టీ నేతలు సింగు నరసింహారావు, మహేష్, రమేష్, భానుప్రకాష్ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల్లో రాజకీయ జోక్యం నివారించాలి

కరపత్రం ఆవిష్కరించిన దళిత సంఘాల నాయకులు



కరపత్రాన్ని ఆవిష్కరించిన దళిత సంఘాల నాయకులు

లక్ష్మీపురం: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో రాజకీయ జోక్యాన్ని నివారించాలని, బాధితులపై కౌంటర్ కేసులను అంగీకరించవద్దని డిమాండ్ చేస్తూ ఈనెల 25న విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే ధర్నాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు బాధితులు, దళిత సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయకుమార్‌లు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని గురువారం కేవీపీఎస్ జిల్లా కార్యాలయంలో ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పట్ల ప్రభుత్వ వైఖరిని విమర్శించారు. దళితుల రక్షణ కోసం ఉన్న చట్టాన్ని పటిష్టంగా అమలు చెయ్యకుండా రాజకీయ జోక్యంతో పోలీసులు కేసులు నిరాకరిస్తున్నారని విమర్శించారు. 41 సీఆర్‌పీసీ నోటీసు ఇచ్చి స్టేషన్ బెయిల్ ఇవ్వటం ఆపాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు బాధితులను బెదిరించే నిందితుల పట్ల పోలీసులు దొంగనిద్ర నటిస్తున్నారని విమర్శించారు.

■ కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జె.నవీన్ ప్రకాష్ మాట్లాడుతూ ఈనెల 25న విజయవాడలో జరిగే ధర్నాలో గుంటూరు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు బాధితులు, దళిత సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. వీసీకే పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కె.జయసుధ, గిరిజన సంఘం నాయకులు చంద్రానాయక్, ఏనుగుల కమలాకర్, జిల్లా నాయకులు బురుగ వెంకటేశ్వర్లు, ఎస్.విజయరాజు, ఎస్.కోటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, బి.ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

మోదీ ఏజెంట్‌గా కేంద్ర ఎన్నికల సంఘం

మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, పలు సంఘాల నాయకులు

లక్ష్మీపురం: దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఏజెంట్‌గా కేంద్ర ఎన్నికల సంఘం పని చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విమర్శించారు. ఈనెల 20న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ – జాషువా – పూలే – పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం – ఎన్నికల కమిషన్ – బిహార్ ఓటు పరిణామాలు అంశంపై జరగనున్న సభ కరపత్రాలను స్థానిక బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాలులో గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఫౌండేషన్ అధ్యక్షుడు విల్సన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో లక్ష్మణరావు మాట్లాడుతూ రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్న బిహార్ రాష్ట్రంలో మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వంతో కేంద్ర ఎన్నికల కమిషన్ కుమ్మక్కై ప్రతిపక్షాల ఓటర్లను భారీ సంఖ్యలో తొలగించిందని ధ్వజమెత్తారు. దేశ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికలపై సంధించిన విమర్శలకు సరైన సమాధానం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై జరగబోయే సభకి భీమ్‌సేనా సేవా దళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పౌర హక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు, అంబేడ్కరిస్ట్ ఎస్.ప్రకాష్, చారువాక యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిన్నం డేవిడ్ విలియమ్స్ తదితరులు పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ సంఘం నాయకులు మద్దు ప్రేమ్ జ్యోతి బాబు, సేనా సేవా దళ్ నాయకులు నల్లపు నీలాంబరం, డాక్టర్ మూకిరి సుధ, తిప్పాబత్తిన గోవిందు, న్యాయవాది శిఖా సురేష్, చిష్టి భాష, ఈమని హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మకో విజిలెన్స్ ప్రాధాన్యత గుర్తించాలి



మాట్లాడుతున్న డాక్టర్ రమణ యశస్వి

గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మసీ విద్యార్థులు ఫార్మకో విజిలెన్స్ ప్రాధాన్యత గుర్తించాని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి పేర్కొన్నారు. గురువారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో 5వ జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ఫార్మకో విజిలెన్సు ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ వైద్యారోగ్యశాఖతో పాటు ఔషధ ఉత్పత్తి, నియంత్రణ విభాగాల్లో ఫార్మకో విజిలెన్స్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. ఫార్మసీ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు ప్రాక్టికల్స్ ద్వారా మేధస్సును అభివృద్ధి పరచుకోవాలని, ఇందుకు కళాశాలలోని ప్రయోగశాలలను వినియోగించుకోవాలని సూచించారు. ఈసందర్భంగా జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా నిర్వహించే వివిధ కార్యక్రమాలతో కూడిన బ్రోచర్ విడుదల చేశారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదన రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి. సీతారామయ్య, విద్యార్థులు పాల్గొన్నారు,

రైల్వేస్టేషన్లలో యూటీఎస్ మొబైల్ క్యూఆర్ కోడ్‌లు

పండుగ రద్దీ సమయంలో సుళువుగా టికెట్లు పొందేందుకు ఏర్పాట్లు



రైల్వే స్టేషన్‌లో క్యూ ఆర్ కోడ్ జాకెట్లు ధరించిన రైల్వే ఉద్యోగులు

లక్ష్మీపురం: రాబోయే పండుగల దృష్ట్యా క్యూలలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా యూటీఎస్ మొబైల్ యాప్ ద్వారా అన్ రిజర్వ్‌డ్ టిక్కెట్లను కొనుగోలు చేయాలని గుంటూరు రైల్వే డివిజనల్ పీఆర్‌ఓ డి.వినయ్‌కాంత్ తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని పలు రైల్వేస్టేషన్ల ఆవరణలో ఎంపిక చేయబడిన సిబ్బంది యూటీఎస్ యాప్‌కు అనుసంధానమైన క్యూఆర్ కోడ్‌లు కలిగిఉన్న దుస్తులు కలిగి ఉంటారని, ఆ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా అన్ రిజర్వ్‌డ్ టికెట్లను సత్వరం కొనుగోలు చేయొచ్చన్నారు. దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడానికి మరియు రిజర్వ్ చేయని టిక్కెట్లను సౌకర్యవంతంగా కొనుగోలు చేయడానికి, యూటీఎస్ మొబైల్ అప్లికేషన్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఆధునిక టికెటింగ్ వ్యవస్థలో యూటీఎస్ యాప్ ఒక పెద్ద ముందడుగన్నారు. రాబోయే పండుగ సీజన్‌లో రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున, స్టేషన్ ప్రాంతాలలో యూటీఎస్ మొబైల్ యాప్ ద్వారా టికెట్ల కొనుగోలును ప్రోత్సహించడానికి దక్షిణ మధ్య రైల్వే ఇటువంటి నూతన చొరవను ప్రవేశపెట్టిందని వినయ్‌కాంత్ తెలిపారు.

మహాభారతంపై ఆధ్యాత్మిక ప్రవచనం




నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవాలయం పద్మావతి కళ్యాణవేదికపై గురువారం మహాభారతం అరణ్య పర్వంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ పాలకమండలి నిర్వాహకులు జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. శ్రీకూర్మనాథస్వామి ప్రసంగిస్తూ మహా భారతంలోని అరణ్య పర్వంలో తీర్థయాత్రలు చేస్తున్న ధర్మరాజుకు అగస్త్య మహర్షి వాతాపి ఇల్వలు వృత్తాంతాన్ని తెలిపారు. ఇల్వల తన సోదరుడైన వాతాపిని ఒక పెద్ద గేదెగా మార్చి, అగస్త్య మహర్షికి ఆహారంగా వడ్డిస్తాడని పేర్కొన్నారు. అయితే అగస్త్యుడు కోపంతో వాతాపిని మింగేసి, ఇల్వలను కూడా సంహరిస్తాడని అన్నారు. ఈ వృత్తాంతం మహాభారతం అరణ్యపర్వంలోని 12వ అధ్యాయంలో వివరించినట్లు భక్తులకు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

గుంటూరు రూరల్: వ్యసనాలకు అలవాటుపడి సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి విక్రయాలను చేస్తూ గంజాయి సేవిస్తున్న ముఠాను నల్లపాడు పోలీస్ స్టేషన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు గంజాయి విక్రయం, వినియోగం, సరఫరా చేస్తున్న వారిపై నిఘా పెట్టి ముమ్మర తనిఖీలు చేపట్టామని తెలిపారు. రూరల్ మండలంలోని వెంగళాయపాలెంలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ మహేష్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి.. టిడ్కో గృహాల్లోని ఒక ఇంటిలో గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా, అదే గ్రామానికి చెందిన చొప్పవరపు ప్రవీణ్, చల్లావారిపాలెంకు చెందిన జల్లెడ సాయిశ్రీనివాసరావులు క్యాటరింగు పనులు చేస్తూ, కొంత కాలంగా వెంగళాయపాలెంకు చెందిన ఇస్మాయిల్, గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రాంతానికి చెందిన హర్ష అనే వారి నుంచి గంజాయి కొనుగోలు చేసి, కొంత తాగుతూ.. కొంత విక్రయిస్తుంటారని తెలిపారు. అలాగే వెంగళాయపాలెంలో లైటింగ్ పనులు చేసుకుంటున్న చీలి వెంకటేష్, చీలి వెంకటసాయి, చుక్క ఆనంద బాబు, కోబాల్డ్‌పేటకు చెందిన మేక అజయ్ కుమార్‌లకు గంజాయిని విక్రయించారని విచారణలో తెలిపారన్నారు. సౌత్ డీఎస్పీ భానోదయ నేతృత్వంలో నల్లపాడు పోలీసులు సిబ్బందితో కలిసి మొదటి నిందితుడు చొప్పవరపు ప్రవీణ్ ఇంటిలో గంజాయి తాగుతుండగా దాడులు నిర్వహించి, వారిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 1.23 కేజీల గంజాయి సీజ్ చేశారని, నిందితులను కోర్టుకు అప్పగించి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న ఇస్మాయిల్, హర్ష పరారీలో ఉన్నారని, త్వరలో వారిని కూడా అరెస్ట్ చేస్తామని సీఐ చెప్పారు. గంజాయి ముఠాను అరెస్ట్ చేయడంలో కృషి చేసిన సౌత్ డీఎస్పీ భానోదయ, నల్లపాడు సీఐ, ఎస్సై, సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారని సీఐ తెలిపారు.

పరుగు పందెంలో సత్తా చాటిన పర్వీన్



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరుగు పందెంలో ప్రథమస్థానంలో నిలిచిన టీజేపీఎస్ కళాశాల సీనియర్ ఇంటర్ విద్యార్థిని షేక్ పర్వీన్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వర శాస్త్రి అభినందించారు. గురువారం పట్టాభిపురంలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కామేశ్వర శాస్త్రి మాట్లాడుతూ బుధవారం ఆచార్య నాగార్జున విశ్వ వద్యాలయంలో నిర్వహించిన 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమస్థానంతో పాటు, 100 మీటర్ల హార్డిల్స్‌లో ద్వితీయ స్థానంలో తమ కళాశాల విద్యార్థిని పర్వీన్ నిలిచిందన్నారు. అదేవిధంగా ఈనెల 27న ఏలూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు పోలిశెట్టి శ్యాం సుందర్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్న షేక్ పర్వీన్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, వ్యాయామ అధ్యాపకుడు టి.వాసుదేవరావు, అధ్యాపకులు పర్వీన్‌ను అభినందించారు.

ధనవంతులై ఉండి సాయం చేయని వారు నేరస్తులు



చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మునగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి

- మునగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి
- రెడ్డి బాలికల హాస్టల్‌లో విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ

నెహ్రూనగర్: ధనవంతులై ఉండి పేద వారికి సాయం చేయలేని వారు ధనవంతులే కాదని.. నా దృష్టిలో వారు నేరస్తులని తెలంగాణ రాష్ట్రం మునగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి స్తంభాల గరువులోని ఉడుముల కోటిరెడ్డి, సాంబిరెడ్డి బాలికల వసతి గృహంలో స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధనవంతులు సమాజంలో పేదలకోసం కొంత ఖర్చుపెడితే వచ్చే తృప్తి మాటల్లో చెప్పలేనిదన్నారు. 150 మంది విద్యార్థినులకు స్కాలర్‌షిప్పులు పంపిణీ కార్యక్రమంలో తనను భాగస్వామ్యం చేయడం అభినందనీయమన్నారు.

■ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ, దాతలు ఇచ్చిన సహకారంతో విద్యార్థినులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని ఆకాంక్షించారు. హాస్టల్ ప్రతినిధులు ఉడుములు శ్రీనివాస రెడ్డి, గుంటూరు వేమారెడ్డి, దుగ్గెంపూడి వెంకట్రామిరెడ్డి, యోగేశ్వరరెడ్డి, మెట్టు రాజేష్‌రెడ్డి, వనుకూరి సూరారెడ్డి, భీమవరపు పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

రేపు ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు

సీజీహెచ్ఎస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.విద్య



స్వచ్ఛత ర్యాలీలో పాల్గొన్న మహిళలకు క్యాన్సర్ పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విద్య

గుంటూరు మెడికల్: 'స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20న గుంటూరు నగరంపాలెంలోని సీజీహెచ్ఎస్ (కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం) వెల్‌నెస్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీజీహెచ్ఎస్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.విద్య గురువారం తెలిపారు. సీజీహెచ్ఎస్ ఎంప్యానెల్డ్ హాస్పిటల్ అర్కా క్యాన్సర్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో 30 సంవత్సరాలు నిండిన మహిళలకు పాప్‌స్మియర్ పరీక్ష, బ్రెస్ట్ పరీక్ష చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. క్యాన్సర్ వైవిధ్యాల ఉనికిని ముందే పసిగట్టటానికి ఈ పరీక్షలు ఎంతో దోహద పడతాయని విద్య తెలిపారు. మహిళల్లో గర్భాశయ, రొమ్ము క్యాన్సర్‌లు ప్రమాదకరంగా మారక ముందే వివాహమైన ప్రతి మహిళ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ విద్య విజ్ఞప్తి చేశారు.

గ్రంథపాలకులకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ



గ్రంథ పాలకులతో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ కోటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: బెంగళూరుకు చెందిన శివ శ్రీ చారిటబుల్ ట్రస్ట్ శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 గ్రంథాలయాలకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. గురువారం అరండల్‌పేటలోని జిల్లా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గ్రంథాలయాల లైబ్రేరియన్‌లకు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు స్మార్ట్ ఫోన్లు అందజేశారు. ఈసందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయాలకు స్మార్టు ఫోన్‌లతోపాటు, టీవీ, రెండు కంప్యూటర్లు వితరణ చేసిన దాతలను అభినందించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడంలో కంప్యూటర్లు ఉపయోగపడతాయన్నారు. పాఠకులు వాటిని వినియోగించుకోవాలని సూచించారు. శివశ్రీ చారిటబుల్ ట్రస్టు శిక్షణ ఫౌండేషన్ సభ్యులు కార్తిక్, బుచ్చిబాబు, డెప్యూటీ లైబ్రేరియన్లు కందుల ఝాన్సీరాణి, లక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ఆర్.కుమార్, జూనియర్ అసిస్టెంట్ యాజిలి బ్రహ్మయ్య, గ్రంథాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

కాకుమాను: పెదనందిపాడు మండలంలోని అబ్బినేనిగుంటపాలెం సెయింట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను గురువారం ఎంఈఓ కె.ఎఫ్.కెన్నడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలు, ఉపాధ్యాయుల పనితీరు పరిశీలించారు.